ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 18 జూన్ 2025

హలో.. రెడీగా ఉన్నారా..?
ఆన్‌లైన్‌లోకి రండి..
వివరాలు చెప్పండి
వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్
6

నీటి నిల్వకు ఏమేం చేస్తున్నారు..?
సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల ఆరా
నేడు క్షేత్రస్థాయి పర్యటన
6

విచారణకు రండి..!
తోపుదుర్తికి మరోసారి పిలుపు
నోటీసులు జారీ చేసిన పోలీసులు



కుంటిమద్ది హెలీప్యాడ్ కేసులో మరోసారి విచారణకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. 'చలో పేరూరు' కేసులో విచారణకు రావాలని ఇదివరకే ఆయనకు ఒక నోటీసు ఇచ్చారు. ఆ కేసులో అరెస్టు భయంలో తోపుదుర్తి అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా కుంటిమద్ది కేసులో రెండోసారి విచారణకు పిలిచారు. వారం రోజుల్లోగా రామగిరి సర్కిల్ కార్యాలయానికి రావాలని సూచించారు. కానీ ఆయన బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించే పనిలో ఉన్నట్లు సమాచారం. దీంతో పోలీసుల ఎదుట ఆయన హాజరు కావడం అనుమానమే అని పలువురు అంటున్నారు.
(వివరాలు మెయిన్‌లో...)



అందరూ ఓ చోట చేరి భోజనం చేస్తున్న విడపనకల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

కమ్మటి భోజనం
- ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లకు సన్న బియ్యం
- విద్యార్థులకు నాణ్యమైన భోజనానికి శ్రీకారం

నెలకు జిల్లాకు 1,010 టన్నులు కేటాయింపు
అక్రమాల అడ్డుకట్టకు ప్రతి ప్యాకెట్‌కు క్యూఆర్ కోడ్
సన్న బియ్యం అన్నం బాగుంది అంటున్న పిల్లలు

అనంతపురం విద్య/విడపనకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సన్న బియ్యం సరఫరా చేస్తోంది. గతంలో లావు బియ్యం తో మధ్యాహ్న భోజనం తయారు చేసి అందిస్తుండటంతో పిల్లలు సరిగా తినేవారు కాదు. చాలా మంది అర్ధాకలితో అలమటించేవారు. దీంతో రక్తహీనతకు గురై అనారోగ్యం బారిన పడేవారు. ఈ సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే సన్న బియ్యంతో భోజనం అందించడానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు సంక్షేమ వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరా చేపట్టారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజ మాన్యాల పరిధిలోని 1715 జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని 183 ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమహాస్టళ్లకు ఈ సన్నబియ్యం సరఫరా చేస్తున్నారు. మొత్తం స్కూళ్లు, హాస్టళ్లకు కలిపి నెలకు1010 టన్నుల సన్నబియ్యం జిల్లాకు కేటాయించి, సరఫరా చేశారు.

క్యూఆర్ కోడ్‌తో బియ్యం ప్యాకెట్ల సరఫరా



పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా చేసే సన్నబియ్యం విషయంలో ఎక్కడా అక్రమాలు, అవకతవకలకు అవకాశం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. 25కిలోలతో ప్యాకెట్ తయారు చేశారు. ప్రతి ప్యాకెట్‌కు ప్రత్యేకంగా క్యూఆర్‌కోడ్ ఏర్పాటు చేశారు. ఆ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌చేస్తే ఆ బియ్యం ఎక్కడ ఉన్నాయి? వాటి నాణ్యత, ఆ బియ్యం ఏ రైతు పండించారు అని కూడా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుం ది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలకు 15,226ప్యాకెట్లు, సంక్షేమ హాస్టళ్లకు 10,003 ప్యాకెట్లను జిల్లా పౌరసరఫరాలశాఖ గోదామ్‌ల నుంచి నేరుగా సరఫరా చేస్తున్నారు. గతంలో డీలర్లకు పంపితే అక్కడి నుంచి స్కూళ్లు, హాస్టళ్లకు బియ్యం మళ్లీ తీసుకెళ్లాల్సి వచ్చేది. దీంతో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు ఇబ్బందులు పడేవారు. ఒక్కోసారి డీలర్లు ఎన్ని బియ్యం ఇస్తే అన్నింటితోనే సర్దుకుంటూ పిల్లలకు అన్యాయం చేయాల్సి వచ్చేది.

ఇపుడు నేరుగా స్కూళ్లు, హాస్టళ్లకు సరఫరా చేయడంతో హెచ్‌ఎంలు, వార్డెన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యంతో అన్నం వండి పెడుతుండటంతో విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. కొన్ని పాఠశాలల్లోని కొందరు ఉపాధ్యాయులు సైతం పాఠశాలలోనే భోజనాలు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం చాలా బాగుంది



స్కూల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. ఇంతకు ముందు భోజనం అంటే ఎందుకులే అనుకునే వాళ్లం. ఇప్పుడు భోజనం బాగుంటుండటంతో ఇక్కడే తినాలనిపిస్తోంది. సన్న బియ్యం భోజనం అంటే ఏదో అనుకున్నా కానీ చాలా బాగుంది.

- హరి, 7వ తరగతి, విడపనకల్లు

ఇంటి భోజనం ఉన్నట్లుంది



స్కూల్లో భోజనం మా ఇంట్లో ఉన్నట్లుం. ఒక సారి తింటే మళ్లీ కొంచెం పెట్టించుకోవాలి అనిపిస్తోంది. మా పాఠశా లలో విద్యార్థులు అందరూ ఇక్కడే భోజనం తింటున్నాము. ఇంతకు ముందు స్టోర్ బియ్యంతో వంటలు చేసేవారు ఇప్పుడు అలాంటిది ఏమి లేదు. మంచి బియ్యంతో వంటలు చేస్తున్నారు. బాగుంది.

- సాయిశరణ్య, ఆరో తరగతి, విడపనకల్లు

గ్రామీణ విద్యార్థులకు అదృష్టం



మధ్యాహ్న భోజనం బాగుంది. పల్లెల నుంచే వచ్చే విద్యార్థులకు ఇటువంటి భోజనం దొరకటం చాలా అదృష్టం. భోజనం బాగాలేకపోతే విడపనకల్లులో ఉండే పిల్లలు ఇంటికి వెళ్లి తిని వచ్చేవారు. కానీ పల్లెల్లో నుంచి వచ్చే మాలాంటి విద్యార్థులు ఎక్కడి పోయి తినలేము. ఇప్పుడు సన్న బియ్యంతో వంటలు చేసి పెడుతూ ఉండటంతో కడుపు నిండా తింటున్నాం. మాకు ఆకలి అనిపించటం లేదు.

- నిఖిల్, ఏడో తరగతి, వేల్పుమడుగు

తల్లికి వందనంపై సర్వత్రా హర్షం
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- సీఎం, మంత్రి లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం అమలు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని ప్రభాకర్‌జీ స్కూల్‌లో మంగళవారం తల్లికి వందనం సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లులు.. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కేట్ కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో పిల్లలకు ఇచ్చే బ్యాగులపై కూడా జగన్ పిచ్చి ఫొటోలు వేసుకున్నాడంటూ మండిపడ్డారు. ఒక అరాచకుడి ఫొటోలు చూస్తూ పిల్లలు చదువుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి గతంలో వచ్చిందన్నారు. గత ప్రభుత్వ విధానాలతో 12 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా మిగిలారని గుర్తు చేశారు. కూటమి పాలనలో మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ ఫొటోతో విద్యార్థి మిత్ర కిట్లు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుండడంతో ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. మంత్రి నారా లోకేశ్ విధానాలతో ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రం మారిపోతుందన్నారు. సీట్ల కోసం సిఫార్సులు చేసుకునే రోజులు చూస్తాయంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. తర్వాత విద్యార్థులు 'థ్యాంక్యూ సీఎం సర్, థ్యాంక్యూ నారా లోకేశ్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా కరువు సంక్షోభ
నిర్వహణ ప్రణాళికలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కరువు సంక్షోభ నిర్వహణ ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కరువు సంక్షోభ నిర్వహణ జిల్లాస్థాయి కమిటీ సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు కరువు సంక్షోభ నిర్వహణ ప్రణాళికను పక్కాగా తయారు చేయాలన్నారు. ప్రతి శాఖ కరువు నివారణకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీంబాషా, సీపీఓ అశోక్‌కుమార్, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక..!



తల్లిదండ్రులకు చిన్నారిని అప్పగిస్తున్న సీఐ

అనంతపురం నగరంలోని అజయ్‌ఘోష్ కాలనీ చెందిన పన్నెండేళ్ల బాలిక మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఇంట్లో చెప్పా పెట్టకుండా ఎటో వెళ్లిపోయింది. తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో నాలుగో పట్టణ పోలీసులకు ఉదయం 8 గంటల సమయంలో మౌఖికంగా ఫిర్యాదు చేశారు. తమ కూతురును ఎలాగైనా కాపాడాలని విన్నవించారు. బాలిక కనిపించడం లేదని తెలియగానే సీఐ జగదీష్ అప్రమత్తమయ్యారు. రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. నగరంలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నందమూరి నగర్ ప్రాంతంలో బాలిక ఉన్నట్లు గంట వ్యవధిలో గుర్తించారు. చిన్నారిని సురక్షితంగా స్టేషన్‌కు తీసుకువచ్చారు. 'ఇంట్లో నుంచి ఎందుకు వెళ్లిపోయావ్..?' అని ఆ చిన్నారిని ఆరా తీస్తే.. 'నన్ను హాస్టల్‌కు పంపుతున్నారు. వెళ్లడం ఇష్టంలేక ఇలా చేశాను' పోలీసులకు తెలిపింది. బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 'మా ఇంటి దీపాన్ని కాపాడారు సర్' అని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వేగంగా స్పందించి, బాలిక ఆచూకీని కనిపెట్టిన సిబ్బందిని సీఐ జగదీష్ అభినందించారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

మినీ కిట్లు మంజూరు

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి మినీ కిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాకు ఈ ఏడాదికి 800 క్వింటాళ్ల కంది, 60 క్వింటాళ్ల మినుములు, 8 క్వింటాళ్ల రాగులు, 6 క్వింటాళ్ల కొర్ర మినీ కిట్లను మంజూరు చేశారు. 4 కేజీల బ్యాగ్‌ల మినీకిట్లను బుధవారం నుంచి మండలాలకు సరఫరా చేస్తామని ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య తెలిపారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మినీ కిట్లను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు.

సూపర్ సిక్స్..!
ఒక్కొక్కటిగా అమలవుతున్న పథకాలు
కూటమి శ్రేణుల్లో పెరిగిన జోష్
నైరాశ్యంలో కూరుకుపోయిన వైసీపీ
ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతలో కేడర్



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
7

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలి
సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
కలెక్టరేట్ ముందు ధర్నా



ధర్నా చేస్తున్న పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రైతులు, కూలీలతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఓబులు మాట్లాడుతూ... శింగనమల, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల పరిధిలో పెన్నా పరివాహక ప్రాంతంలో రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, గోపురాజుపల్లి, చిత్రచేడు, కల్లమడి, ఇల్లూరు గ్రామాలకు సాగు, తాగునీరు అందుతోందన్నారు. కొందరు పెన్నాలో పట్టా భూములున్నాయంటూ ఇసుక మేటల తొలగింపు పేరుతో నడి పెన్నాలో రాత్రి పూట అక్రమంగా వందల ట్రక్కుల ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీనిని వెంటనే అడ్డుకోవాలన్నారు. లేకపోతే వ్యవసాయ బోరుబావులు ఎండిపోయి, వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. అక్రమ ఇసుక తరలింపును అరికట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తరిమెల నాగరాజు, విశ్వనాథ్, చంద్రశేఖర్, భాస్కరరెడ్డి, రమణ, సుధీర్, రంగారెడ్డి, సంగప్ప, నారాయణరెడ్డి, సత్యనారాయణ, గోవర్ధన్, మల్లికార్జున, చిన్నప్ప యాదవ్, బాలిరెడ్డి పాల్గొన్నారు.



ఖాళీగా ఉన్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కుర్చీ

ఎవరూ రారా..!

అనంతపురం వైద్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రభుత్వ వైద్య కళాశాలకు పెద్ద దిక్కు లేకుండా పోయింది. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఇటీవల బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. రెండు కీలక స్థానాలకు నియామకాలు జరుగుతాయని మంగళవారం రాత్రి వరకు ఆస్పత్రి, వైద్య కళాశాల వర్గాలు వేచి చూశాయి. కానీ ఉత్తర్వులు వెలువడలేదు. ఆ పోస్టుల్లోకి రెగ్యులర్ అధికారులుగా వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని సమాచారం. గతంలోనూ ఎక్కువ కాలం ఇన్‌చార్జిల పాలనే సాగింది. ఎవరిని నియమించినా.. అయిష్టంగానే కుర్చీల్లో కూర్చుంటున్నారు. కుదురుగా ఉండటం లేదు. బాధ్యతలు చేపట్టింది మొదలు తిరిగి వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు చేయడం పరిపాటిగా మారింది. ఇక్కడి ప్రొఫెసర్లనే ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌గా నియమిస్తే తప్ప పాలన సవ్యంగా సాగదని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.

అమర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి అండ
రూ.50 లక్షలు, భూమిపత్రాల అందజేత



(వివరాలు మెయిన్‌లో...)



యోగా చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు పండమేటి వెంకటరమణస్వామి దేవాలయం పార్కులో మంగళవారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులు, సిబ్బందితో కలిసి యోగా మాస్టర్లు సూచించిన ఆసనాలు వేశారు. యోగా మనిషికి చాలా అవసరమని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి రోజూ యోగా చేస్తే ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, సీఐ శ్రీహర్ష, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



డీఎస్సీ పరీక్షలు వాయిదా

కొత్తచెరువు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాల నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1, 2 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. పరీక్షా కేంద్రాలు, పరీక్షా తేదీలు మార్చిన హాల్ టిక్కెట్లను https//apdsc.appfas.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన సూచించారు. డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడి ఎంపిక


ద్వారకానాథ్ శర్మ

ధర్మవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన ద్వారకనాథ్‌శర్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు అఖిల భారతబ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నుంచి ఆదేశాలు వచ్చాయి. తన ఎంపికకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ప్రతినిధి అనంతకుమారి, రాష్ట్ర ఏబీవీఎం ఈడీసెల్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నరేశ్‌కుమార్‌లకు ద్వారకనాథ్‌శర్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై రేపు అవగాహన

అనంతపురం రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులోగల పీవీకేకే ఐటీ, పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న పాలిసెట్-2025 వెబ్ కౌన్సెలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వైభవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు.

నిష్ణాతులైన పాలిటెక్నిక్ ప్రొఫెసర్లు.. ధ్రువపత్రాల పరిశీలన, వెబ్‌కౌన్సిలింగ్‌లోని సమస్యలు, ఆన్‌లైన్‌లో కళాశాల ఎంపిక, కౌన్సిలింగ్ విధానం వంటి వాటి గురించి వివరిస్తారన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సుకు హాజరయ్యే వారి కోసం ఆర్టీసీ బస్టాండు నుంచి ఉదయం 9గంటలకు ఉచిత కాలేజీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 9848471460, 8886621123, 8886621124, 8886630024 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


డబ్బులు తీసుకునిగానీ వెళ్లేది లేదు..!


బారులు తీరిన మహిళలు.. వంతు వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో.. ఏమో..!




నా చదువులకే కదమ్మా..?


ఇది మా విజయం..!


ఎందుకైనా మంచిది.. ఎంచుకుంటా..!


వచ్చే సంవత్సరం ఇంకో రూ.13 వేలు ఎక్కువగా వస్తాయి కదమ్మా..!

అమ్మ చేతికి సొమ్ము

బ్యాంకులు, పోస్టాఫీసు నుంచి డ్రా

తల్లికి వందనం సొమ్మును డ్రా చేసేందుకు వచ్చే మహిళలతో బ్యాంకులు, పోస్టాఫీసులు కిటకిటలాడుతున్నాయి. అనంతపురం హెడ్ పోస్టాఫీసు వద్ద వందలాది మంది మంగళవారం బారులు తీరారు. తపాలా శాఖ సిబ్బంది వారి ఖాతాలో జమ అయిన నగదు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ అయిన సొమ్మును చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక బిడ్డ ఉంటే రూ.13 వేలు.. ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురికి రూ.39 వేలు, నలుగురికి రూ.52 వేలు.. ఇలా ఎంత మంది పిల్లలు ఉంటే అంత ఎక్కువ నగదు అమ్మచేతికి అందింది. నగదు సరిగా ఉందో లేదో అక్కడే కూర్చుని మహిళలు లెక్కబెట్టుకున్నారు. ఎవరెవరికి ఎంత వచ్చిందో క్యూలో ఉన్నవారు చర్చించుకుంటూ సందడిగా గడిపారు.

-ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య


రెండు రోజులైనా జనం తగ్గనేలేదక్కా..! మన వంతు ఎప్పుడొస్తుందో ఏమో..!


ఎంతమంది పిల్లలక్కా..? అందరికీ వచ్చిందా..?

హలో.. రెడీగా ఉన్నారా..?

ఆన్‌లైన్‌లోకి రండి.. వివరాలు చెప్పండి

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం వైద్యం, జూలై 17(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయం వచ్చేందంటే జిల్లా కేంద్రానికి రావాల్సిందే. ఇది ఒకప్పటి పరిస్థితి. కానీ ఇప్పుడు సాంకేంతికను అందిపుచ్చుకుని, ఉన్నచోటు నుంచే ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌కు హాజరై.. బదిలీ చేయించుకోవచ్చు. ఒక్కో ఉద్యోగి బదిలీ ప్రక్రియ ఒకటి, రెండు నిమిషాల్లోనే పూర్తి అవుతోంది.


కౌన్సెలింగ్ కోసం మెడికల్ కాలేజీలో నిరీక్షిస్తున్న నర్సులు

డీఎంహెచ్‌ఓ, వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్యాలయాల్లో బదిలీలు ఇలాగే జరుగుతున్నాయి. కౌన్సెలింగ్ ప్రారంభంకాగానే.. 'హలో.. రెడీగా ఉన్నారా..? ఆన్‌లైన్‌లోకి రండి..' అని ఉన్నతాధికారులు పిలవగానే ఉద్యోగి వీడియో కాల్‌లో ప్రత్యక్షమౌతున్నారు. తన వివరాలు, బదిలీ ఆప్షన్లు ఇస్తున్నారు. ఈ బదిలీల ప్రక్రియ మంగళవారం అర్థరాత్రి వరకు కొనసాగింది.

కొనసాగుతున్న ప్రక్రియ

వైద్య, ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో కడప నుంచి అధికారులు జూమ్ మీటింగ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ట్యూటర్ గ్రేడ్-2, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్, డీపీఎంఓ, ఆఫీస్ సూపరింటెండెట్, రేడియోగ్రాఫర్, పీఎంఓఓ, పీహెచ్‌ఎన్(టీచింగ్), హెడ్‌నర్స్, హెల్త్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్ కేడర్లకు మంగళవారం రాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ, డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్స్ ఎంపీహెచ్‌పీఎస్(ఫిమేల్), పీహెచ్‌ఎన్(నాన్ టీచింగ్), జూనియర్ అనలిస్ట్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, ఎంపీహెచ్‌పీఎస్(మేల్), సీనియర్ అసిస్టెంట్,ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్-2 ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.


జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బదిలీలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

122 ఏఎన్‌ఎం పోస్టులకు..

ఉమ్మడి జిల్లాలోని 122 సబ్‌సెంటర్లలో 122 ఎంపీహెచ్‌పీఎస్-ఫిమేల్(ఏఎన్‌ఎం) పోస్టులకు బుధవారం బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారు. అయితే ఏఎన్‌ఎం ట్రైనింగ్ సెంటర్‌లో వార్డెన్, తోపుదుర్తి, మరూరు సబ్‌సెంటర్స్‌లో ఏఎన్‌ఎం పోస్టులను ఖాళీలు చూపలేదు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్లియర్ వేకెన్సీస్ కేటగిరిలో చేర్చడంలేదని డీఎంహెచ్‌ఓ ఆదేశాల్లో పేర్కొన్నారు.

అండర్-19 మహిళా క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జిల్లా అండర్-19 మహిళా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-19 మహిళా క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి ప్రకటించారు. జట్టులో నేహ, హిమవర్షిణి, రోషనారా, ఛాయాశ్రీ, స్వాతి, గీతిక, గౌతమి, హస్సిరెడ్డి, ధారామోహన్, అమూల్య, నందిని, తేజశ్విని, మైత్రి, చక్రిక, ఎస్‌కే తరుణం, స్టాండ్‌బైలుగా మాన్విత, భువనేశ్వరి, యావన, నాగజ్యోతి, చైత్ర, స్రవంతి, హుస్నా హాజిరా చోటు దక్కించుకున్నారు. కోచ్‌గా నజీర్‌అహ్మద్ నియమితుడయ్యారు. ఎంపికైన జట్టు ఈనెల 19వ తేదీ నుంచి నెల్లూరులో నిర్వహించే సౌత్‌జోన్ అండర్-19 క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని భీమలింగారెడ్డి తెలిపారు.




విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన

రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ నరసింహులు


సదస్సులో పాల్గొన్న వీసీ, డైరెక్టర్లు

అనంతపురంరూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధనలు సాగించాలని రాయలసీమ యూనివర్సిటీ మునుపటి వీసీ ఆచార్య నరసింహులు అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో మంగళవారం జాతీయ విద్యావిధానంపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య నరసింహులు మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో అధ్యాపకులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కోర్సులు ఎంచుకునే సౌలభ్యాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలి, సుబ్బారెడ్డి, సుజాత, పద్మసువర్ణ, కిర్మయి, నాగప్రసాద్‌నాయుడు, దుర్గాప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, చిత్ర శోభాబిందు, సురేష్‌బాబు, శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

కవితా పోటీల విజేతల వెల్లడి




సొరపు గోవిందరాజులు, సత్యనారాయణరాజు, పీజీ వెంకటేష్

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల విజేతల వివరాలను మంగళవారం ఆ సంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి వెల్లడించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని 'ఆర్డీటి సేవలు-అభాగ్యులకు వరాలు' అనే అంశంపై ఈనెల 6 నుంచి 10వతేదీ వరకు వాట్సాప్ ద్వారా కవితలను పోటీలకు ఆహ్వానించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పుదుచ్చేరి నుంచి 131 మంది తమ కవితలను పంపారు. పోటీలకు జనప్రియ కవి ఏలూరి యంగన్న న్యాయనిర్ణేతగా వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతికి అనంతపురం నగరానికి చెందిన సొరపు గోవిందరాజులు, ద్వితీయ బహుమతికి విజయవాడ వాసి సత్యనారాయణరాజు, తృతీయ బహుమతికి అనంతపురానికి చెందిన పీజీ వెంకటేష్ కవితలు ఎంపికయ్యాయి. ప్రత్యేక బహుమతులకు చంద్రశేఖరరావు (విశాఖపట్నం), గంగాధర్ (హిందూపురం), పెండేకంటి పార్థసారధి (అనంతపురం), జమున (మహబూబ్‌నగర్), వైరాగ్యం ప్రభాకర్ (కరీంనగర్)ను ఎంపిక చేశారు. విజేతలకు మొమెంటో, నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలను కొరియర్‌ద్వారా పంపుతామని టీవీ రెడ్డి వివరించారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

● సహజ వ్యవసాయమే మార్గం ● కరువు, ఎడారీకరణ నివారణ అత్యవసరం ● వక్తల పిలుపు


రైతులు ఏర్పాటు చేసిన సేంద్రియ పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్17(ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనీ, అందుకు సహజ వ్యవసాయమే మార్గమని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ కరువులు, ఎడారీకరణ నివారణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కరువు-వాతావరణ మార్పులు-ప్రకృతి వ్యవసాయం ప్రదర్శన సదస్సు నిర్వహించారు. డీఆర్వో మలోల మాట్లాడుతూ.. రైతులు, జిల్లా ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరమన్నారు. సహజ వ్యవసాయంతో అటు నేల, ఇటు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అభివృద్ధి పర్యావరణానికి హాని కలిగించేవిధంగా ఉండకూడదన్నారు. వాతావరణాన్ని కాపాడేదిగా ఉండాలని వివరించారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడానికి, వాతావరణంలో వస్తున్న మార్పులను తిప్పికొట్టడానికి సహజ వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా రసాయన ఎరువులు, కలుపు మందులు వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని దెబ్బతీశామన్నారు. మట్టిలోకి రసాయనాలు చేరడంతో ఆహారధాన్యాల ఉత్పాదకత దెబ్బతింటోందన్నారు. ఈ కారణంగా తలెత్తుతున్న అనేక అనారోగ్య సమస్యలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపాల్ విజయశంకర్ బాబు, రైతు సాధికార సంస్థ అధికారి లక్ష్మానాయక్, వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీరెడ్డి, రెడ్స్ డైరెక్టర్ భానూజ, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్రహ్మణ్యం, మిల్లెట్స్ మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

నీటి నిల్వకు ఏమేం చేస్తున్నారు..?

సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యుల ఆరా

నేడు క్షేత్రస్థాయిలో పర్యటన

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలశక్తి అభియాన్ పనుల గురించి సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్ విచారించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి, పలు అంశాల గురించి మంగళవారం చర్చించారు. డ్వామా పీడీ కార్యాలయంలో జలశక్తి అభియాన్ పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సాయంత్రం సందర్శించారు. నీటిని నిల్వ కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను కమిటీ సభ్యులకు డ్వామా పీడీ సలీం బాషా, వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి వివరించారు. వాటర్ షెడ్, ఉపాధి పథకం ద్వారా చేపట్టిన అమృత్ సరోవన్ నీటి కుంటలు, ఫాం పాండ్స్ డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశువుల నీటి తొట్టెలు, గొర్రెలు, మేకల షెడ్ల ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా, వాటర్ షెడ్, కృషి విజ్ఞాన కేంద్రం, ఏపీఎంఐపీ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్షేత్రస్థాయి పర్యటన

సెంట్రల్ వాటర్ కమీషన్ కమిటీ సభ్యులు బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను బుధవారం ఉదయం 10.15 గంటలకు పరిశీలిస్తారు. చెక్ డ్యాంల పరిశీలన, చిజిల్ నాగలితో లోతు దుక్కి చేయడాన్ని పరిశీలిస్తారు. అనంతరం రైతులతో మాట్లాడతారు. తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని 12 గంటలకు పరిశీలిస్తారు. ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాం పాండ్స్‌ను మధ్యాహ్నం 12.30 గంటలకు పరిశీలిస్తారు. గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫాం పాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని మధ్యాహ్నం 3.30 గంటల నుంచి పరిశీలిస్తారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను ఆ రోజు మధ్యాహ్నం పరిశీలిస్తారు.


వాటర్ షెడ్, ఉపాధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు శంకర్, గౌతమ్

డ్వామా ఏపీఓల బదిలీ

అనంతపురం అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిది మంది డ్వామా ఏపీఓలను బదిలీ చేశారు. ఈ మేరకు డ్వామా పీడీ సలీం బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారి వివరాలు ఇవి..

ఏపీఓ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
తులసీ ప్రసాద్	ఉరవకొండ	పుట్లూరు
సుజాత	పుట్లూరు	ఉరవకొండ
విమల	గుంతకల్లు	వజ్రకరూరు
లక్ష్మీకాంతబాయి	వజ్రకరూరు	బొమ్మనహాళ్
భాగ్యలక్ష్మి	బొమ్మనహాళ్	శింగనమల
ఓబిరెడ్డి	కుందుర్పి	యల్లనూరు
రవి	యల్లనూరు	రాయదుర్గం
విజయభారతి	రాయదుర్గం	పెద్దవడుగూరు
మల్లీశ్వరి	శింగనమల	విడపనకల్లు

దాణాను సద్వినియోగం చేసుకోండి: మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత సూచించారు. పట్టణంలోని పశువైద్య శాఖ కార్యాలయంలో జేడీ శుభదాస్, ఏడీ శ్రీరాములు నాయక్‌తో కలిసి రైతులకు మంగళవారం పశుదాణా పంపిణీ చేశారు. ప్రొటీన్లు పశువులకు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు దాణా అందిస్తోందని తెలిపారు. పెనుకొండ మండలానికి 197 దాణా ప్యాకెట్లు కేటాయించామని, ఒక్కో ప్యాకెట్టు విలువ రూ.1100 కాగా సబ్సిడీతో రూ.550కే ఇస్తున్నామని తెలిపారు.

మెరుగైన సేవలు అందించండి

ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ అధికారులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు ఆదేశించారు. విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పరిస్థితుల గురించి ఆరా తీశారు. రెవెన్యూ కలెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ల గురించి చర్చించారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయిన వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలని సూచించారు. మరమ్మతులకు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రైతులు, వినియోగదారులను ఇబ్బందిపెట్టవద్దని సూచించారు. లైన్లు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో గుర్తించి, మార్చాలని ఆదేశించారు. నెలవారీ రెవెన్యూ కలెక్షన్లు విధిగా నిర్వర్తించి, సంస్థ పురోగతికి సహకరించాలని కోరారు. సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్‌ఈ శేషాద్రి శేఖర్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్‌ఈ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వినతులు...

సీఎండీ సంతోష్‌రావుకు పలువురు ఉద్యోగులు తమ సమస్యలను వివరించి, వినతిపత్రాలను సమర్పించారు. విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాము తదితరులు సీఎండీని కలిశారు. జిల్లాల పునర్విభజన కారణంగా 2022 డిసెంబరులో అనంతపురం నుంచి 57 మందిని అక్రమంగా పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బదిలీలు చేపట్టాల్సి ఉండగా, అప్పటి అధికారులు కేవలం అనంతపురం సర్కిల్ పరిధిలోని వారిని మాత్రమే పుట్టపర్తికి బదిలీ చేశారని అన్నారు. ఈ కారణంగా బాధితులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆప్షన్లు ఇచ్చి తమను తిరిగి అనంతపురానికి బదిలీ చేయించాలని కోరారు. మూడు నెలల్లోపు తిరిగి అనంతపురం బదిలీ చేసేలా చర్యలు చేపడతామని సీఎండీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హర్ష, అల్లాబకాష్, రాము, వెంకటరమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

ట్రాక్టర్ కింద పడి చేనేత కార్మికుడి మృతి


ఆంజనేయులు (ఫైల్)

ధర్మవరం, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్ సమీపంలో సీఎన్‌బీ కల్యాణమండపం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చేనేత కార్మికుడు ఆంజనేయులు(43) మృతి చెందాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, స్థానికులు తెలిపిన మేరకు..స్థానిక శాంతినగర్‌కు చెందిన నిమ్మూర్తి ఆంజనేయులు మగ్గాలకు జాకార్డు కడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మండలంలోని గొట్లూరు గ్రామంలో జాకార్డు కట్టడానికి మంగళవారం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో సీఎన్‌బీ కల్యాణమండపం వద్ద ఎదురుగా ఉన్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొని కిందకు పడ్డాడు. అంతలోనే ధర్మవరం వైపు నుంచి వెనుకగా వస్తున్న ట్రాక్టర్ ఆంజనేయులుపై వెళ్లింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆంజనేయులు మృతి వార్త విని భార్య, పిల్లలు బోరున విలపించారు. మృతుడికి భార్య సరోజమ్మ, ఇద్దరు కుమారులున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగలింగ (ఫైల్)

గుంతకల్లు టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లదాసరి పల్లి గ్రామానికి చెందిన రైతు గుండాల నాగలింగ(68) అప్పులబాధ తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు నాగలింగకు 18 ఎకరాల పొలం ఉంది. గత మూడేళ్ల నుంచి బోరు బావి కింద మిరప పంట సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల కోసం దాదాపు రూ. 10లక్షలు అప్పు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడం, వచ్చినప్పుడు గిట్టుబాటు ధర లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని కుటుంబసభ్యులతో తరచూ మథనపడేవాడు. ఈక్రమంలోనే ఇంట్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి, మంటలు ఆర్పి, 108 వాహనం ద్వారా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగలింగకు భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈసంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడు..

గుత్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీకి చెందిన ఇంతియాజ్(24) ప్రేమ విఫలమై మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాంద్ బాషా కుమారుడు ఇంతియాజ్ బీటెక్ పూర్తి చేశాడు. ఓ యువతిని ప్రేమించాడు. ప్రేమ విఫలం కావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి కుటుంబసభ్యులు గమనించి, స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఇంతియాజ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి


గ్రీష్మ (ఫైల్)

గార్లదిన్నె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని కొప్పలకొండ గ్రామానికి చెందిన గడ్డం గ్రీష్మ (18) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ, నాగవేణి దంపతుల కుమార్తె గ్రీష్మ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉండేది. కడుపునొప్పి తాళలేక నాలుగు రోజుల కిందట ఈమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి...

అనంతపురం న్యూటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగర పరిధి నేషనల్ పార్కు బ్రిడ్జి వద్ద మంగళవారం మధ్యాహ్నం 50 ఏళ్ల లోపు వయసున్న వ్యక్తి రైలు కిందపడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగు స్లాగ్, బ్రౌన్‌కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ రఫీ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కటకటాల్లోకి కామాంధుడు...!

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి చేసి, గర్భవతిని చేసిన కేసులో ఇందిరమ్మకాలనీకి చెందిన మత బోధకుడు మహమ్మద్ ఫయాజ్‌ను పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. కొంత కాలం కింద తన వారి యోగక్షేమాలు చూసేందుకు బంధువుల అమ్మాయి(14)ని ఇంటికి తెచ్చుకున్నాడు. ఇటీవల బాలిక పుష్పవతి అయ్యింది. అప్పటి నుంచి ఆమెపై కన్నేశాడు. పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక ఐదున్నర నెలల గర్భం దాల్చింది. ఇటీవల విషయం తల్లికి తెలియడంతో దిశ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బాలికపై లైంగిక దాడి విచారణలో నిర్ధారణైంది. నిందితుడిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా పేర్కొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.31వేలు

అనంతపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక చీనీ మార్కెట్ మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.31వేలు, కనిష్టంగా రూ.4వేలు, సరాసరి రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 731 టన్నుల చీనీకాయలు వచ్చాయని ఆయన వివరించారు.

'తుంగభద్ర'కు పెరిగిన ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరిగింది. తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు 14,621 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలో 29.14 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 6.07 టీఎంసీలు మాత్రమే ఉంది. 944 కూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేదని అధికారులు తెలిపారు.

సూపర్ సిక్స్..!

ఒక్కొక్కటిగా అమలవుతున్న పథకాలు
కూటమి శ్రేణుల్లో పెరిగిన జోష్
నైరాశ్యంలో కూరుకుపోయిన వైసీపీ
ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతలో కేడర్


పాతూరు ప్రభాకర్ జీ పాఠశాలలో తల్లికి వందనం.. కూతుళ్ల సంబరం..!

అనంతపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుం డటం కూటమి పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపుతోంది. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే మరో వైపు అభివృద్ధి పనులు చేపడుతోంది. ఈ పరిణామాలు కూటమి పార్టీల శ్రేణుల్లో జోష్ నింపుతుండగా, వైసీపీ శ్రేణులను నైరాశ్యంలోకి నెడుతున్నాయి. ఆ పార్టీ నాయకులు ఉనికి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. వైసీపీ అధినేత, వైఎస్ జగన్ మొదలుకొని ఆ పార్టీ దిగువ శ్రేణి నాయకులతోపాటు కార్యకర్తలు ఇప్పటి వరకు తల్లికి వందనం అమలు చేయలేదంటూ... నీకు రూ.15వేలు... నీకు రూ15వేలు.. నీకు రూ.15వేలు అంటూ హేళన చేసేవారు. తాజాగా ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం సొమ్ము వారి తల్లి ఖాతాలోకి జమ చేశారు. దీంతో వైసీపీ శ్రేణుల సెటైర్లు, హేళనలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. మరో మూడు రోజుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇప్పటికే రైతులతో ఈకేవైసీ పూర్తి చేశారు. అనంత జిల్లాలో 270477 మంది రైతులను అర్హులుగా తేల్చారు. వీరందరి ఖాతాలకు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కానుంది. మరోవైపు ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున వారి ఖాతాలకు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.3300 కోట్లు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఆగస్టులో మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీ అమలు చేస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు, ఆయన మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇలా సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుండగా... వైసీపీ వ్యవహార శైలితో ఆ పార్టీ గ్రాఫ్ రోజు రోజుకు పడిపోతోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఉనికి కోసం వైసీపీ పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పెంపు మొదలుకొని ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, అన్నా క్యాంటిన్ల ద్వారా పేదోడి కడుపునింపేందుకు రూ.5లకే అల్పాహారం, భోజనం అందిస్తోంది. మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ అవకాశాలు, పీ-4 ద్వారా పేద కుటుంబాలకు చేయూత... పరిశ్రమల స్థాపన, తల్లికి వందనం పథకం అమలు చేసింది. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ అమలు చేయనున్నారు. అతిత్వరలో ఆడబిడ్డ నిధి, ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నారు. ఇలా సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫాస్ట్‌తో కూటమి ప్రభుత్వం అమలు చేసి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటుండటంతో వైసీపీ నాయకులు ఉనికి కోల్పోతామేమోనన్న అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల్లో కొర్రీలు చూపి, ఆరోపణలు, విమర్శలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. అధికారంలో ఉన్నాన్నాళ్లు బటన్ నొక్కుడు తప్పా జిల్లా అభివృద్ధికి ఏం చేశారన్న ప్రశ్న వైసీపీ శ్రేణుల నుంచే నాయకులు ఎదుర్కొంటున్న పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఓ వైపు పార్టీ శ్రేణుల నుంచి ఎదురవుతున్న అసంతృప్తులు... మరో వైపు సూపర్ సిక్స్ పథకాల అమలు ఆ పార్టీ ముఖ్యనాయకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

అభివృద్ధికి బాటలు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్న భావన ప్రజల్లో ఉంది. పరిశ్రమల విషయంలోనూ వైసీపీ ఎలాంటి చొరవ చూపలేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాకు జీవనాడైన హంద్రీనీవాను అప్పటి సీఎం జగన్, జిల్లా ప్రజాప్రతినిధులుగా ఉన్న నాయకులు సైతం పట్టించుకోలేదన్నది నిర్వివాదాంశం. ఎస్సీఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమాన్ని విస్మరించేలా ఆ వర్గాల కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారు. ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారు. ఆ వర్గాలకు చెందిన 22 పథకాలను రద్దు చేశారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకపోగా ఉన్న పరిశ్రమలను కమీషన్ కోసం తరిమికొట్టిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఈ వ్యవహారాలన్నీ ఆ పార్టీకి శాపంగా పరిగణించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే హంద్రీనీవా పనులు పరుగులు పెడుతున్నాయి. రూ.3800 కోట్లు హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులకు కేటాయించడం కరువు జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతోంది. కరువు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ రూ.వేల కోట్ల పెట్టుబడితో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఇలా కరువు జిల్లా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతో వైసీపీ నేతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.త

అక్రమార్కులపై చర్యలేవీ?

వైసీపీ హయాంలో రెచ్చిపోయిన
పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు
ఆ పార్టీ నేతలు చెప్పిందే శాసనంగా విధులు
అడ్డగోలుగా అక్రమాలు... విచారణలో బట్టబయలు
నివేదికలు బుట్టదాఖలు

వైసీపీ హయాంలో అనంతపురం రూరల్ మండలంలో పనిచేసిన ఓ మహిళా కార్యదర్శి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. ఆమె అవినీతిపై విచారణ కూడా చేయించారు. ఆ తర్వాత అటకెక్కించారు. ఎంచక్కా.. ప్రమోషన్ ఇచ్చి పంపారు.

వైసీపీ హయాంలో అనంతపురం రూరల్ మండలంలో ఎక్కువ కాలం పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అక్రమాలకు అంతే లేదు. అప్పటి ఉపసర్పంచ్ చెప్పిందే వేదంగా పనిచేశారన్నది బహిరంగ రహస్యమే. భవన నిర్మాణ అనుమతుల్లో వసూళ్ల పరంపర సాగించారు. అభివృద్ధి పనుల్లో అడ్డగోలుగా దోచుకున్నారు. వైసీపీ బంటులా పనిచేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం పోయే పరిస్థితి రావడంతో అప్పుడు గానీ, ఇక్కడి నుంచి వెళ్లలేదు. ఇలా.. గత వైసీపీ హయాంలో చాలామంది పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం మారినా వారిపై నేటికీ చర్యలు తీసుకోలేదు. విచారణ చేసినా.. నివేదికలు ఏ కాకి ఎత్తుకెళ్లిందో.. ఉన్నతాధికారులే చెప్పాలి మరి..

వైసీపీ హయాంలో బుక్కరాయసముద్రం మండలంలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి వైసీపీ నాయకులతో అంటకాగారు. తాను ప్రభుత్వోద్యోగినన్న విషయం మరచి, వైసీపీ నాయకుడిలా వ్యవహరించారు. ఆ పార్టీ నాయకులతో కలిసి రెచ్చిపోయారు. అభివృద్ధి పనులు, నిర్మాణ అనుమతుల్లో వసూళ్ల పర్వం సాగించారు. అక్రమాలు బయటపడడంతో సర్పంచ్‌పై నెపం వేసి, తప్పించుకున్నారు. అక్కడి నుంచి ఆ కార్యదర్శి అనంతపురం రూరల్ మండలానికి వచ్చారు. అధికార పార్టీ అండతో మరింత రెచ్చిపోయారు. ఈయన అక్రమాలపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అప్పటి డీఎల్‌పీఓ విచారణ చేసి, అవినీతిని నిగ్గుతేల్చారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. వాటిని బుట్టదాఖలు చేశారు. తమకు అనుకూలమైన అధికారి ద్వారా మళ్లీ విచారణ చేయించి, అంతా బాగుందన్నట్లు నివేదిక ఇప్పించుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ పంచాయతీ కార్యదర్శిని పక్క జిల్లాకు బదిలీ చేశారు. ఇటీవల బదిలీల్లో ఆ అధికారికి అందలం దక్కింది. మళ్లీ అనంతపురం రూరల్ మండలానికి రావాలని ప్రయత్నించారు. కుదరకపోవడంతో గార్లదిన్నె మండలానికెళ్లారు.

అనంతపురం న్యూటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్డీలు హద్దు మీరారన్నది బహిరంగ రహస్యమే. ఆ పార్టీ నాయకులు చెప్పిందే శాసనంగా అమలు చేశారు. వారి అండతో చెలరేగిపోయారు. అభివృద్ధి పనుల్లో అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. ఉన్నతాధికారులపై సైతం ఆధిపత్యం చెలాయించారు. వారి అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టారు. అందులో అవినీతి బట్టబయలైంది. దీంతో విచారణ నివేదికలనే బుట్టదాఖలు చేశారు. నేటికీ చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

ఆ మండలాల్లో విపరీతం

వైసీపీ ప్రభుత్వంలో అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, రాప్తాడు, పామిడి, పుట్లూరు, యల్లనూరు, ఉరవకొండ, కణేకల్లు మండలాల్లో పనిచేసిన పలువురు కార్యదర్శుల మాటకు ఎదురులేదన్నది బహిరంగ రహస్యమే. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న ప్రచారం జరుగుతోంది. బుక్కరాయసముద్రంలో అక్రమాలకు హద్దేలేదు. సర్పంచ్‌ను డమ్మీని చేసి, నిధులు మింగేశారు. అక్రమాలను సర్పంచ్‌పైకి నెట్టి, చెక్‌పవర్ రద్దయ్యేలా చేశారు. అనంతపురం రూరల్ మండలంలో పనిచేసిన ఓ సెక్రటరీ స్థానిక నాయకుడి అనుచరుడికి లక్షల విలువచేసే పంచాయతీ స్థలాన్ని కట్టబెట్టినట్లు అప్పటిలో దుమారం రేగింది. వారు అడిగినంత ఇచ్చుకుంటేనే ఇల్లు కట్టుకోవచ్చనీ, లేదంటే ఇబ్బందులు తప్పవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచారణ ఆపడానికి రూ.లక్షలు..?

అనంతపురం రూరల్ మండలంలోని ఓ మేజర్ పంచాయతీలో రూ.50 లక్షలుపైగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపించాయి. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అక్రమాల పుట్ట బద్ధలైతే ఉద్యోగం ఊడటం తథ్యమని భావించిన ఆ కార్యదర్శి.. ఫిర్యాదిదారుకు లక్షల్లో ముట్టజెప్పి, వాపసు తీసుకునే యత్నాలు సాగించాడన్న ప్రచారం జరుగుతోంది. వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

బదిలీల్లో తప్పిదాలను సరిదిద్దాలి

డీఈఓకు ఎస్టీయూ నాయకుల వినతి

అనంతపురం విద్య, జూన్ 17(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిదిద్దాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గుంతకల్లు, గుత్తి ప్రాంతాల్లో తలెత్తిన తప్పిదాలను డీఈఓకు వివరించి, వాటిని పరిదిద్దాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

నెట్టికంటి హుండీ ఆదాయం రూ.81.83 లక్షలు

గుంతకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.81.83 లక్షల ఆదాయం లభించింది. దేవదాయ శాఖ పరిశీలకుల సమక్షంలో మంగళవారం హుండీలను తెరిచి, అందులో భక్తులు వేసిన విరాళాల సొమ్మును లెక్కగట్టారు. గత 83 రోజులకుగాను ప్రధాన హుండీల ద్వారా రూ.81.39 లక్షలు, అన్నదానం హుండీల ద్వారా రూ.44,173 కలిపి మొత్తం రూ.81.83 లక్షల ఆదాయం సమకూరింది. హుండీల్లో భక్తులు 14.1 గ్రాముల బంగారం, 2.96 కేజీల వెండి వేసినట్లు తేలింది. 10 విలువ కలిగిన అమెరికన్ డాలరును సమర్పించుకున్నారు. భక్తులు 83 రోజుల్లో హుండీలో వెసిన మొత్తాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, వలంటీర్లు పాల్గొన్నారు.


కసాపురం ఆలయంలో హుండీ సొమ్మును లెక్కిస్తున్న దృశ్యం

గాలివాన బీభత్సం

మర్తాడులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు


మర్తాడులో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు

గార్లదిన్నె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నె, మర్తాడు, యర్రగుంట్ల, సంజీవపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. మర్తాడు గ్రామం లో ఇళ్లకు సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు పడిపోవడంతో పాటు మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలను మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించిన ఏ మాత్రం పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

20న బ్యాంకు ఉద్యోగాలకు మేళా

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీన స్థానిక ఏఎఫ్ ఎకాలజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివి 18 నుంచి 26 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ప్రొ కోర్సులో శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో 20వతేదీన హాజరుకావాలన్నారు. వివరాలకు 8121717846 నంబరులో సంప్రదించాలని కోరారు.

అనుమానంతో భార్యపై దాడి

చికిత్స పొందుతూ మృతి

రాప్తాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త.. అనుమానంతో దాడి చేయడంతో భార్య మృతిచెందింది. రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లికి చెందిన సాకే నరసింహులు, సాకే పద్మావతి దంపతుల కుమార్తె నందిని 9 ఏళ్ల క్రితం అనంతపురం టౌన్ నవోదయ కాలనీకి చెందిన పోకుల విజయ్‌కుమార్‌ను కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. తరువాత వారు రాప్తాడులో బాడుగ ఇంట్లో నివాసం ఉంటున్నారు. విజయ్‌కుమార్ పెళ్లిళ్లకు డెకరేషన్ చేసే పనులకు వెళ్లేవాడు. ఈనెల 16న రాత్రి 9 గంటల సమయంలో విజయ్‌కుమార్ అనుమానంతో భార్య నందిని తలపై బలంగా కట్టెతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను సోమవారం రాత్రి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందింది. నందిని తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడిపత్రి, జూన్17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మరణించాడు. స్థానిక సీబీ రోడ్డులో పడి ఉన్న అతడిని ఈనెల 16న అంబులెన్స్ ద్వారా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అతడు చనిపోయాడని పట్టణ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసై అనారోగ్యం బారినపడి మృతిచెందాడని వారు భావిస్తున్నారు.

చదువుల తల్లికి పెళ్లి చేసే యత్నం..!

పదో తరగతి టాపర్‌కు నిశ్చితార్థం

నార్పల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. బాలిక పదోతరగతి చదివేటపుడే మేనమామతో వివాహం చేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినిని కళాశాలలో చేర్చకపోవడంతో టీచర్లకు అనుమానం వచ్చి తల్లిదండ్రులను విచారించారు. బాల్య వివాహం చేయవద్దనీ, కళాశాలలో చేర్పించాలని నచ్చజెప్పారు. ఇప్పటికే బాలికకు నిశ్చితార్థం చేసినట్లు తెలిసింది. ఏగుడి దగ్గరికో వెళ్లి వివాహం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఐసీడీఎస్, పోలీసు అధికారులు.. ఈ బాల్యావివాహాన్ని అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేదవాళ్లకు, అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా నిలుస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు తన క్యాంపు కార్యాలయంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అందించారు. 10 మంది లబ్ధిదారులకు రూ. 10.85 లక్షల విలువైన చెక్కులు అందించారు. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎందరో అభాగ్యులకు సీఎం అండగా నిలుస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ. 2.50 కోట్లకుపైగా సాయం అందించామని తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని నవయుగ కాలనీలో తాగునీటి వసతి కల్పించాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం నవయుగ కాలనీవాసులతోపాటు సీపీఐ నాయకులు ఎంపీడీఓ దివాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... కాలనీ ఏర్పాటై దశాబ్దకాలం దాటినా నేటికీ మంచినీటి సౌకర్యం లేకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లీపీరా, రాజు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు చట్టాలు ఇప్పుడు గుర్తొచ్చాయా..?

శింగనమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అధికారం పోతూనే వైసీపీ నేతలకు చట్టాలు గుర్తుకు రావడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లి పర్యటనకు జగన్ వెళ్లి పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకుంటున్నారని వైసీపీ నేత లు చేస్తున్న ఆరోపణలు అసంబద్ధమన్నారు. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నేతలు కుట్రపన్నుతున్నారని అన్నారు. పరామర్శల పేరుతో శాంతి భద్రతల సమస్యలు సృష్టించేదుకు వైసీపీ శ్రేణులు ప్రయత్నాలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

ఏఓగా కృష్ణచైతన్య



రాప్తాడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయఅధికారి (ఏఓ)గా కృష్ణ చైతన్యను నియమించారు. ఏఓ బదిలీల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పుల్లంపేటలో పనిచేస్తున్న కృష్ణచైత్యాను రాప్తాడు ఏఓగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీవాణిని ప్రసన్నాయపల్లిలోని భూసార సంరక్షణ శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు. నూతన ఏఓకు వ్యవసాయ శాఖ సిబ్బంది పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నేకొత్తపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం హాజరవుతున్నట్టు టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ విద్యాలయాల్లో ఉదయం 10 గంటలకు కిట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి



సీడీపీఓను కలిసిన కార్యకర్తలు

శింగనమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయ పాలన పాటించాలని సీడీపీఓ లలితమ్మ పేర్కొన్నారు. మంగళవారం నూతన సీడీపీఓను అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు రమణమ్మ, రత్నమ్మ, భారతి, ప్రమీల, లీలావతి, రామంజినమ్మ కలసి పూలగుచ్ఛం అందజేసి శుభాంకాక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలిపై కేసు

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళ, ఇద్దరు విటులపై మంగళవారం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాంనగర్‌లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వెనుక ప్రాంతంలో వరలక్ష్మి అనే మహిళ వ్యభిచార గృహం నిర్వహిస్తూ వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకురాలితోపాటు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సీఐ జగదీష్ మాట్లాడుతూ... నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించి, ప్రజలకు అ సౌకర్యం కలిగించినా సహించేది లేదన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీఆర్ఏలు రైతులకు అందుబాటులో ఉండాలి

శింగనమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీఆర్ఏలు రైతులకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శేషారెడ్డి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శేషారెడ్డిని మంగళవారం వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.ఓబిలేసు, మండల వీఆర్ఏలు ధనుంజయ, శ్రీనివాసులు, రామాంజనేయులు, బీబీ, నాగరత్న, మౌలాలి, నల్లప్ప, అరుణ్, ఓబిలేసు, చంద్ర తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకునిరావాలని సూచించారు.



తహసీల్దార్ శేషారెడ్డిని కలిసిన వీఆర్ఏలు

నిరుపయోగంగా బాస్కెట్‌బాల్ కోర్టు

● రాజేంద్ర నగర పాలకోన్నత పాఠశాలలో రూ.25 లక్షలతో నిర్మాణం ● నిర్వహణ విస్మరించిన శాప్, స్కూల్





రూ.25 లక్షలతో నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టు, విరిగిపోయిన బోర్డు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అత్యాధునికంగా నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టు నిరుపయోగంగా మారింది. గత ఏడాది ఆగస్టులో నగరంలోని రాజేంద్ర నగరపాలకోన్నత పాఠశాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిధులు రూ.25 లక్షలతో సింథటిక్ బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించారు. నగరంలోనే అత్యాధునిక హంగులతో ఈ బాస్కెట్‌బాల్ కోర్టును తీర్చిదిద్దారు. నెల రోజులు మాత్రమే ఈ కోర్టులో క్రీడాకారులు సాధన చేశారు. తర్వాత దానికి తాళం వేశారు. ప్రజాధనంతో నిర్మించి బాస్కెట్‌బాల్ కోర్టును ఇలా నిరుపయోగంగా ఉంచడం పట్ల అటు క్రీడాకారులు, ఇటు క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, పీడీలు, శాప్ కోచ్‌లు ఈ బాస్కెట్‌బాల్ కోర్టును పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించినా ఫలితం లేకుండా పోతోంది. దీనిపై డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా... బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటులో కొంత లోపం ఉంది, దాన్ని సరిచేసి తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు.

తల్లికి వందనం దేశంలోనే రికార్డ్: పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిల్లలందరికీ తల్లికివందనం పథకం అమలు చేసి దేశంలోనే రికార్డు సాధించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందడంతో సంబరాలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సైకో జగన్ పాఠశాలల్లో కూడా రాజకీయాలు చేశారన్నారు. విద్యామిత్ర కిట్లపై జగన్ ఫొటోలు ముద్రించి పబ్లిసిటీ చేసుకున్నారన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యా మిత్ర కిట్లపై సర్వేపల్లి రాధాకృష్ణ వంటి మహనీయుల ఫొటోలతో అందచేస్తున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు విద్యనందించే విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, సర్పంచ్ తిరుపాలు, క న్వీనర్లు కొండప్ప, పోతులయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ ఉజ్జినప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, బీరన్న, నారాయణస్వామి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్యాలెస్‌కు తరలించే సంస్కృతి జగన్‌దే: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : అమ్మఒడి, చిక్కీలు, ఇతర కమీషన్ల డబ్బులు తాడేపల్లి, బెంగళూరు ప్యాలెస్‌కు తరలించిన సంస్కృతి జగన్‌దేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.... జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ఎప్పుడు పడుతుందా అని ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వంలో స్కూళ్లు తెరిచిన రోజే 'తల్లికివందనం' డబ్బులు పడ్డాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటా తల్లుల్లో ఆనందం ఉట్టిపడుతోందన్నారు. రూ.10 వేల కోట్లు తల్లులకు పంచిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు దక్కుతుందన్నారు. అమ్మఒడిలో కోత పెట్టిన రూ.2 వేల డబ్బులు బెంగళూరు ప్యాలెసా, తాడేపల్లి ప్యాలెస్‌కా.. ఎక్కడికి తరలించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు విషప్రచారం మానుకోవాలన్నారు. టీడీపీ వల్లే ఏపీలో అభివృద్ధి పరుగుపెడుతోందన్నారు. కియా, సోలార్, విండ్ పవర్ పరిశ్రమలు టీడీపీ వల్లే వచ్చాయని గుర్తుచేశారు. ఇలాగే పిచ్చి కూతలు కూస్తే.. జైళ్లకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

పంచాయతీ సమస్యలు తెలియజేయండి

● అనంతపురంరూరల్: మండలంలోని పంచాయతీల్లో ఎలాంటి సమస్యలుఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీలో రూ.10కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. మరో రూ.6 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.22 కోట్లతో అంచనాలు వేస్తున్నామని వివరించారు. ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే అడ్మిషన్లు చేయాలి: ఏపీసీ



మాట్లాడుతున్న ఏపీసీ

అనంతపురం విద్య, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే అడ్మిషన్లు చేయాలని ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ పేర్కొన్నారు. ఆడపిల్లలకు చదువులు అందించి ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలనే ఆశయంతో కస్తూరిబాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేశారని, వాటికి చెడ్డపేరుతెస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మంగళవారం జిల్లా సైన్స్ సెంటర్‌లో కేజీబీవీల ఎస్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం కావడంతో పిల్లలకు అవసరమైన పుస్తకాలు, కిట్స్, యూనిఫామ్స్ సకాలంలో అందించాలన్నారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని తెలిపారు. తప్పనిసరిగా మెనూ అమలుకు కృషి చేయాలన్నారు. ఆడపిల్లల భద్రత విషయంలోను ఎక్కడా నిర్లక్ష్య వహించరాదన్నారు. 6వ తరగతి అడ్మిషన్లు నిబంధనల మేరకు చేర్చుకోవాలన్నారు. ప్రతిఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. ఎస్ఓలు నిరంతరం అందుబాటులో ఉండి పర్యవేక్షణ జరపాలన్నారు. ఎక్కడ ఏమి జరిగినా అందుకు ఎస్ఓలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇరువర్గాల గొడవ.. కేసు నమోదు

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో ఇరు వర్గాలు గొడవ పడటంతో.. మంగళవారం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలో 4వ రోడ్డులో సోమవారం రాత్రి 11 -12 గంటల సమయంలో ఇమ్రాన్, సల్మాన్, దాదాపీర్ ఒక వర్గంగా, గణేష్, పార్థసారధి, ప్రణీత్ గొడవపడ్డారు. పాత కక్షలతో మాట మాటా పెరిగి ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసుకున్నారు. ఇరు వర్గాలకు మూగదెబ్బలు తగిలాయి. ఈ గొడవ విషయం తెలుసుకున్న 3వ పట్టణ పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే..., చట్టాన్ని ఉల్లంఘించి గొడవలు పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శాంతలాల్ హెచ్చరించారు.


పాలస్తీనాకు సంఘీభావంగా నిలుద్దాం



క్లాక్‌టవర్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాలస్తీనా దేశానికి సంఘీభావంగా నిలుద్దామని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పిలుపునిచ్చారు. పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం క్లాక్‌టవర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... రెండు సంవత్సరాల నుంచి పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 60వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని, వీరిలో అత్యధికమంది చిన్నారులు, మహిళలే ఉన్నారని అన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని విమర్శించారు. ఇజ్రాయిల్ దేశం ఒక జాతిని సమూలంగా నాశనం చేసేవిధంగా పాలస్తీనాపై దాడులు చేస్తోందని, చిన్నపిల్లల పట్ల దాడులను ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, సామాజిక కార్యకర్తలు, మానవతావాదులు ఖండిస్తున్నా ఏమాత్రం లెక్క చేయడం లేదన్నారు. ఇజ్రాయిల్ పట్ల భారత ప్రభుత్వ మెతక వైఖరి వీడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటనారాయణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, నాయకులు బాలకృష్ణ, రాజు, శీనా, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, ఇస్మాయిల్, ఆది, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే



నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అనంతపురం టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పాత్రికేయుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడంతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన దాదాపు 280 మంది పాత్రికేయుల పిల్లలకు నోటుపుస్తకాలు, పెన్నుల పంపిణీ చేపట్టారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ వినోద్ కుమార్, డీఐపీఆర్ఓ బాలకొండయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాలాజి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్‌రెడ్డి సహకారంతో నోటుపుస్తకాల పంపిణీ చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి ఓ పాత్రికేయుడిగా వివిధ పత్రికల్లో పనిచేస్తూనే తనను ఈ స్థాయికి తీసుకొచ్చారని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయుల పిల్లలకు సంబంధించి అన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ అమలు చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పల్లె వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ... ఇటీవల మృతి చెందిన హెచ్ఎంటీవీ విలేకరి నాగరాజు కుమారుడి విద్యాభ్యాసానికయ్యే ఖర్చును తమ సొసైటీనే భరిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆజాద్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు షఫి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: మాంచో ఫెర్రర్



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాంచో ఫెర్రర్, ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆర్డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. నార్పల మండల కేంద్రంలో వకుళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలం వెంకట నరసానాయుడు సారథ్యంలో నిర్వహించిన వెంకట్ వకుళ ఫౌండేషన్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించిన వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకటనరసానాయుడును అభినందించారు. మంగళవారం ఫైనల్ మ్యాచ్ బుక్కరాయసముద్రం, నార్పల జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన బుక్కరాయసముద్రం జట్టు 13.1 ఓవర్‌కు 98 పరుగులకు ఆలౌట్ అయ్యారు. తరువాత బ్యాటింగ్ చేసిన నార్పల జట్టు 13.1 ఓవర్‌కు 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసి విజయం సాధించారు. ఆర్డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్ చేతుల మీదుగా విన్నర్‌కు కప్, రూ.50వేల నగదు అందజేశారు. రన్నర్‌కు కప్, రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ వకుళఫౌండేషన్ వాలంటీర్లు, నార్పల మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీ సెక్టార్, తల్లికి వందనం పథకం, అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), పెన్షన్స్, అన్నక్యాంటీన్లు, ఫర్టిలైజర్స్, సీడ్స్, రెవెన్యూ సేవలు, ఆసుపత్రి సేవలు, బియ్యం పంపిణీ, దీపం-2 పథకం, ఏపీఎస్ఆర్టీసీ, పంచాయతీ, మున్సిపల్ సేవలు, ఎలక్ట్రిసిటీ, ఇసుక తదితర ప్రభుత్వ పథకాల అమలుపై ఆయా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో వారంతా స్వయంగా పాల్గొనాలన్నారు. అన్నక్యాంటీన్లను నెలకు ఒకటి చొప్పున తనిఖీ చేసి, అక్కడే భోజనం చేయాలన్నారు. రైతు సేవ కేంద్రాలను నెలకోసారి తనిఖీ చేయాలని, పీజీఆర్ఎస్ సమస్యను వారానికోసారి స్వయంగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నామని, కొంతమందికి ఈ పథకం కింద డబ్బులు రావడం ఇబ్బందిగా ఉందని, ఈకేవైసీ పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ఈనెల 21న పండుగ వాతావరణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని, ఇందుకు కళాశాలలు, పాఠశాలల్లో వేదిక ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు సరఫరా చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర పనులు చేపట్టాలని డీపీఓను ఆదేశించారు.

కల్లుగీత కార్మికులను సొసైటీలోకి తీసుకోండి

అనంతపురం కలెక్టరేట్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కొత్త కల్లు గీత కార్మికులను టీటీసీఎస్ సొసైటీలోకి తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కు ఈడిగ సంఘం రాయలసీమ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్ విన్నవించారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా అనంతపురంలో నివాసముంటున్న వారిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్మికులుగా గుర్తించిన డాక్యుమెంట్‌ను కలెక్టర్‌కు చూపించా రు. అనంతపురం టీటీసీఎస్ సొసైటీలో తీసుకోవడానికి ప్రెసిడెంట్ రఘురామయ్య, సభ్యులు నిరాకరిస్తున్న విషయం కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వేణుగోపాల్, ప్రసాద్, రామాంజినేయులు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్ర, వెంకటేష్, రాము, పరకాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపడితే చర్యలు



ఊటకాలవపై ఏర్పాటు చేసిన పైపులైన్‌ను తొలగిస్తున్న అధికారులు

గార్లదిన్నె, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బండారు ఈరమ్మ హెచ్చరించారు. మండల పరిధిలోని కల్లూరు ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఊటకాలువను కొందరు పూడ్చి అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మంగళవారం తహసీల్దార్, వీఆర్వో రవి, పోలీసు సిబ్బందితో వెళ్లి ఊటకాలువ పూడ్చి ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల్లో, చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వంలో వడ్డెర్లకు న్యాయం

అనంతపురం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే వడ్డెర్లకు న్యాయం జరుగుతుందని వడ్డెర సంఘం నాయకులు పే ర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకటేషులు మాట్లాడుతూ....ప్రభుత్వం వడ్డెర్లకు కంకర క్వారీల్లో రాయితీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం రాయితీ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే వడ్డెర్ల సొసైటీల ద్వారా సొసైటీకి 12 హెక్టార్ల కంకర క్వారీలు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. గనులశాఖలో వసూలు చేసే సీనరేజీలో సైతం 50 శాతం రాయితీ ఇవ్వనుండటం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో వడ్డెర్లకు పరికరాలను 50 శాతం సబ్సిడీతో అందించాలని కో రా రు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, రవీంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

చెత్తను వెంటనే తొలగించాలి: కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడ చెత్త వేసినా...24గంటల్లో తీసివేయాలని పారిశుధ్య సిబ్బందికి అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్‌హాల్‌లో పారిశుధ్య పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ప్రతి రోజు డోర్ టూ డోర్ చెత్త సేకరణ, చెత్తకుప్పలను 24 గంటల్లో తీసివేయాలని ఆదేశించారు. నగరంలోని వ్యాపారులందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వద్దు-క్లాత్.జ్యూట్ బ్యాగ్‌లు ముద్దు అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యం చేసి రాష్ట్రంలోనే ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రతి దుకాణం, సంస్థల ఎదుట ప్లాస్టిక్ వద్దు-క్లాత్-జ్యూట్ బ్యాగ్ ముద్దు అనే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచినప్పు డే నగర ప్రజల సంతృప్తిస్థాయిని పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పావని, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో పరిశీలన

నగరంలోని అశోక్‌నగర్ బ్రిడ్జితో పాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పర్యటించారు. బ్రిడ్జి వద్ద ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని...నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం గుర్తించాలని ఈఈ షాకీర్‌ను ఆయన ఆదేశించారు.

పాఠశాలలో 'తల్లికి వందనం' సంబరాలు

అనంతపురం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కంపల్లి పంచాయతీ ఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో తల్లికివందనం పథకంపై సంబరాలు నిర్వహించారు. కుమ్మరశాలివాహన సాధికార సమతి జిల్లా కన్వీనర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు కలసి ఎన్టీఆర్‌రామారావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విద్యాకిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వన్నూర్ స్వామి, లాలు, గురుస్వామి, ఫక్రుద్దీన్, నూరు, బాబావలి పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు

నయవంచకుడు.. జగన్..!

ప్రభుత్వ విప్ కాలవ ధ్వజం



రాయదుర్గం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):' హామీలను గాలికి వదిలేసిన జగన్‌రెడ్డి.. ప్రజల దృష్టిలో నయవంచకుడిగా మిగిలిపోయాడు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఓర్వలేక అతని సొంత మీడియా.. సోషయల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నాడు. వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరు..' అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. త్వరలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల ఆనందంలో పాలు పంచుకుంటామన్నారు.

ఆ సొమ్ము ఏం చేశావ్.. జగన్?

'అమ్మ ఒడి' నిధులపై ప్రశ్నించిన ఎమ్మెల్యే అమిలినేని



దళిత కాలనీలో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ' తల్లికి వందనం కింద రూ. 15 వేలలో రూ. 13 వేలు చెల్లిస్తూ విద్యార్థికి చెల్లిస్తూ.. మిగిలిన రూ. 2 వేలను పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం కూటమి ప్రభుత్వం కలెక్టర్ ఖాతాల్లో వేస్తోంది. ఈ విషయం తెలీక జగన్‌రెడ్డి పేటీఎం బ్యాచ్‌తో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నాడు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అమ్మ ఒడి నిధుల్లోనూ రూ.2 వేల కోత విధించిన జగన్.. ఆ నిధులను తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించాడా లేక బెంగళూరు ప్యాలెస్‌కు మళ్లించాడో ప్రజలకు చెప్పాలి.' అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధ్వజమెత్తారు. మండలంలోని దురదకుంట గ్రామంలో ఎమ్మెల్యే పల్లెబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దళిత కాలనీలో ఎమ్మెల్యే దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఆయన వెంట అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధిని ఓర్వలేని బటన్ రెడ్డి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండిపాటు



గుంతకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ' వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి పలు పథకాల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తుత్తి బటన్లను నొక్కుతూ ప్రజలను మోసం చేశాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాల్లో నాలుగింటిని పూర్తిచేసింది. ఇక త్వరలోనే ఆ రెండు కూడా అమల్లోకి తెస్తుంది. తల్లికి వందనం పథకం అర్హులందరికీ అందింది. ఈ అభివృద్ధిని ఓర్వలేకే ఆ ఉత్తుత్తి బటన్ రెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు.' అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండిపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాల అమలను ఓర్వలేని జగన్ బ్యాచ్ బురదజల్లడానికి యత్నిస్తోందన్నారు. వాటిని తిప్పికొడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబు వెంట నిలవాలన్నారు.

చట్టాలు ఇప్పుడు గుర్తొచ్చాయా..?

వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఫైర్



పుట్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో నాయకులు రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. అప్రజాస్వామిక పరిపాలన చేశారు. అన్నివర్గాల ప్రజలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. లేనిపోని కేసులు బనాయించారు. అధికారం పోవడంతోనే ఆ పార్టీ నాయకులు ఇప్పుడు చట్టాలు.. రాజ్యాంగం గుర్తుకు వస్తున్నట్లు ఉంది.' అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైసీపీ అరాచక పాలనను భరించలేక ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం గట్టారన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకులు తీరు మారలేదని, శాంతి భద్రతల సమస్యలు సృష్టించేందుకే ప్రజలను ఉసిగొల్పుతున్నారని అన్నారు. రాప్తాడులో హెలికాప్టర్‌పై వైసీపీ శ్రేణులతోనే దాడి చేయించారని, ఇప్పుడు అరాచకాలు సృష్టించేందుకు జగన్ సత్తెనపల్లికి వెళుతున్నాడని అన్నారు. శాంతిభద్రతల విషయంలో కూటమి ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్టీఈ చట్టాన్ని అమలు చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆర్టీఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెక్రసీ పార్టీ నాయకులు ఆర్డీఓ శ్రీనివాస్‌కు మంగళవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ మాట్లాడుతూ.. పట్టణంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో ఎంఈఓ కుమ్మక్కై, విద్యా హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ పార్టీ నాయకులు సత్తార్, రామాంజినేయులు, రామదాస్, భాషా, జానయ్య, నాగార్జున, మనోహర్ ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

గుంతకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి దీక్షిత్ పరీక్షల్లో 596 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచాడు. అతన్ని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సన్మానించారు.

ఉపకరణాల అందజేత : జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్యే దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీచేశారు. లబ్ధిదారులకు చేతికర్రలు, ట్రైసైకిళ్లను అందజేశారు.

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

కళ్యాణదుర్గం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజావేదిక వద్ద వ్యోమిక కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉచిత డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. ప్రతి నెలా రెండు బ్యాచ్‌లుగా 100 మందికి యువతకు ఈ శిక్షణ ఇస్తారని, యువత సద్వినియోగం చేసుకోని ఉపాధి పొందాలని సూచించారు.

బయోమెట్రిక్ అవసరం లేదు : ఏఓ

కూడేరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి రైతుల బయోమెట్రిక్ అవసరం లేదని ఏఓ శుభకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలం గొట్కూరు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. అనంతరం పొలంలో వేరుశనగ పంటను పరిశీలించి .. ఊడలు దిగే సమయానికి ఎకరాకు నాలుగు బస్తాల జిప్సం వేయాలని సూచించారు.

అగ్రిగోల్డ్ భూముల సర్వే

బ్రహ్మసముద్రం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతే కొండాపురం గ్రామ పరిధిలో ఎర్రకొండాపురం మామడూరు గ్రామాల పరిధిలో అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించిన 74.44 ఎకరాల భూములను అధికారులు సర్వే చేసి.. హద్దులను నిర్ణయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో ఈ సర్వే పనులు చేపట్టారు. ఇందులో కర్నూలు సీఐడీ డీఎస్పీ వహీద్ బాషా, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, సీఐడీ ఎస్‌ఐ సాదిక్ బాషా, డీఎల్‌సీ మెంబర్ ప్రతాప్‌రెడ్డి, అగ్రిగోల్డ్ ప్రతినిధులు, గౌస్, ఖాదర్, నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బ్రహ్మయ్య



కణేకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నూతన తహసీల్దార్‌గా బ్రహ్మయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఫణికుమార్ బదిలీ కాగా అతని స్థానంలో శింగనమల నుంచి బ్రహ్మయ్య ఇక్కడికి బదిలీ అయ్యారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్‌బాబు

● డీ.హీరేహాళ్ : డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రాయదుర్గం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఆయన్ను ఇక్కడి బదిలీ చేశారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ

యాడికి, జూన్17(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ఎన్నికై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యాడికిలో వికసిత్ భారత్ సంకల్ప సభను మంగళవారం నిర్వహించారు. ఇందులో బీజేపీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు అంకాల్‌రెడ్డి, రాజశేఖర్, గంగాధర్, చౌడయ్య, లక్ష్మీదేవి, మురళీ, ఆనంద్, జగదీష్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఎమ్మెల్యే ఆరా



పర్యటిస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారు, బంకమడివీధి, ఓంశాంతినగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. కాలనీవాసులతో సమస్యలపై ఆరా తీశారు.

విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయండి

తాడిపత్రి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా తెలుగుదేశం నాయకుడు జేసీ పవన్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయానశాఖ మంత్రి రాంమోహన్ నాయుడిని మంగళవారం కోరారు. తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో సిమెంట్, నల్లబండలు, గ్రానైట్, ఐరన్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, వీటివల్ల విమానాశ్రయానికి ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.

పాఠశాలను పునరుద్ధరించండి



ఎంఈఓ కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పామిడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామగిరి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను డౌన్ గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చిన విషయం తెల్సిందే. గ్రామంలోని ఆ ప్రాథమికోన్నత పాఠశాల పునరుద్ధరించాల్సిందేనని మంగళవారం విధులకు హాజరైన ఉపాధ్యాయులతో విద్యార్థుల తల్లిదండ్రులు వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ జయానాయక్ అక్కడికి చేరుకొని తల్లిదండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేశారు. ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

రాయదుర్గం రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో బాలుర కళాశాల ఆవరణంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. నిరుద్యోగభృతి నెలకు రూ. మూడు వేలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేసి అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగయ్య, శంకర్, దినకర్, జునైద్, రమేష్, షోయాబ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత

గుత్తి,జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులోని బీసీ కాలనీ ప్రధాన రోడ్డులో ఓ వ్యక్తి రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడు. దీనిపై ఆ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆ నిర్మాణ పనులు నిలిపివేయించారు.

ఘనంగా గంగమ్మ జాతర

గుత్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజీకాలనీలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ దేవి జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో కాలనీలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని చెరువు కట్టపైన ఉన్న గంగమ్మపాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూర్ ఈశ్వర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ సావిత్రి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయాలంటే రూ.20 ఇవ్వాల్సిందే



డబ్బులు ఇస్తున్న రైతు

యల్లనూరు, జూన్17 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేయాలంటే రూ.20 ఇవ్వాల్సిందేనని సచివాలయాల్లోని ఎంపీఈఓలు డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సోమవారం కల్లూరు సచివాలయంలో ఎంపీఈఓ వసూలు చేసినట్లు తెలిపారు. దీనిపై ఏడీఏ చెంగళరాయుడును వివరణకోరగా.. విచారిస్తామని, వసూలు చేసి ఉంటే తిరిగి రైతులకు ఇప్పిస్తామని తెలిపారు.

మద్యం షాపులకు రీ నోటిఫికేషన్



సిబ్బందికి సూచనలిస్తున్న నాగమద్దయ్య

కళ్యాణదుర్గం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మున్సిపాల్టీ పరిధిలో గెజిట్ నెం. 127 మద్యం షాపు నిర్వహించేందుకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ జారీ చేసిందని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. ఈ నెల 19న సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కానీ హైబ్రిడ్ పద్ధతుల్లో దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. జిల్లాలోని ఎనిమిది ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 21న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో మద్యం షాపును కేటాయిస్తామన్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ సీఐలు సోమశేఖర్, ఎస్ఐలు ఆంజనేయులు, శంకర్‌నారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఇమ్రాన్, నరసరాజు, కానిస్టేబుల్ ప్రతాప్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

● తాడిపత్రి : తాడిపత్రి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 89, 93, 100 మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించి రీనోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ జి. నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

● గుత్తి : ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పెద్దవడుగూరు మండలం ఏటీ/72 మద్యంషాపు నిర్వాహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.2లక్షలు నాన్ రిఫండబుల్ డిపాజిట్‌తో ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

గుంతకల్లుటౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం మన్యు సూక్త హోమాన్ని నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువు దీర్చి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎర్రితాత హుండీ ఆదాయం లెక్కింపు

బెళుగుప్ప, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అవధూత ఎర్రితాత హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ సేవా సంఘం సభ్యులు లెక్కించారు. ఆదాయం రూ. 84,987 రాగా.. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలకు రూ. 51,780 ఖర్చు చేసినట్లు సభ్యులు తెలిపారు.

ఘనంగా జాతర



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, పెద్దమ్మ (ఇన్‌సెట్లో)

పామిడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రజక వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మ, గంగమ్మ జాతరను ఘనంగా జరిగింది. స్థానిక రజక కమ్యూనిటీ హాల్ నుంచి రజకులు బోనాలతో మెయిన్ బజార్ మీదుగా బొడ్రాయి వద్ద చాకలి వీధిలోని పెద్దమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, పెన్నానదిలో గంగపూజ చేపట్టారు. ఇందులో రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ లింగమయ్య, మండల అధ్యక్షుడు సీ సుంకన్న, ఉపాధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి అనీల్, సీనియర్ నాయకులు స్టీచ్‌వెల్ శ్రీరాములు, పెద్దరాయుడు, నరసింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం

తాడిపత్రి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తల్లికి వందనం పథకం అందాలని కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం వారు పట్టణంలో భగత్‌సింగ్‌నగర్, నందలపాడు తదితర ప్రాంతాల్లో తల్లికి వందనం పథకంలో అనర్హుల జాబితాను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, వీఆర్వోలతో మాట్లాడారు. విద్యుత్ యూనిట్లు ఎక్కువగా వచ్చాయని, పొలాలు అధికంగా ఉన్నాయని, ఇన్‌కం ట్యాక్స్ కడుతున్నారని.. పలువురికి ఈ పథకం అందకపోవడాన్ని గుర్తించారు. దీంతో ప్రతి ఇంటికి వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించి.. ఈ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అమర్‌నాథ్ (ఫైల్)

తాడిపత్రి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేనాపురం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో అమర్‌నాథ్ (29) మరణించాడు. కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన ఇతను కొంతకాలంగా పట్టణంలో ఉంటూ అర్జాస్ స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రోజూ పట్టణంలో నుంచే అర్జాస్ ప్లాంట్‌కు వెళ్లేవాడు. మంగళవారం అర్జాస్ ప్లాంట్‌కు వెళ్లే సమయంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడి గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అతనికి భార్య కల్యాణి, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

వైసీపీ మద్దతుదారుల ఇళ్లపై దాడి

తాడిపత్రి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీలో నివాసముంటున్న సూర్యతేజారెడ్డి ఇంటిపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వారు దాడిచేసి సీసీ కెమెరాలతోపాటు స్కూటీని పగలగొట్టారు. ఇంటిపై రాళ్లు వేశారు. అదేవిధంగా గాంధీనగర్‌లో ఉన్న వెంకటేష్ ఇంటివద్దకు వెళ్లి టీవీఎస్ ఎక్సెల్ వాహనానికి నిప్పు పెట్టడంతో అది పాక్షికంగా దెబ్బతింది. ఇంటిపై రాళ్లు వేసి ధ్వంసం చేశారు. అదేవిధంగా చుక్కలూరులోని భాస్కర్ ఇంటిపై దాడిచేసి సీసీ కెమెరాలు పగలగొట్టి.. ఇంటిపై రాళ్లు వేసి.. స్కూటీని పగలగొట్టారు. పట్టణంలో జరిగిన దాడులపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని, అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

ఎనిమిది మందిపై పిచ్చికుక్క దాడి



ప్రభుత్వ వైద్యశాలలో బాధితులు

యాడికి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గరిడివీధి, లాలెప్పకాలనీల్లో మంగళవారం పిచ్చికుక్క ఎనిమిది మందిపై దాడి చేసి.. గాయపర్చింది. స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, మేధాన్స్, లాస్యతో పాటు స్థానికులు లక్ష్మీదేవి, వెంకటలక్షుమ్మ, వెంకటరాముడు మరో ఇద్దరు ఈ పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. వీరంతా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్



నిందితుడిని కర్ణాటక పోలీసులకు అప్పగిస్తున్న స్థానిక పోలీసులు

గుంతకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం కిందూజర్ జిల్లా కలియహట అనే గ్రామానికి చెందిన శుభాంకర్ అనే సెల్‌ఫోన్ల దొంగలను గుంతకల్లు రాష్ట్ర ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ పోలీసులు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుల బ్యాగులను తనిఖీచేయగా, శుభాంకర్ బ్యాగ్‌లో 19 మొబైల్ ఫోన్లు కనిపించాయి. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. అతను కర్ణాటక రాష్ట్రం టవరకెరెలోని కేపీఎన్ లేబుల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. ఆ ఫ్యాక్టరీలో పనిచేసే ఉద్యోగులు సెక్యూరిటీ వద్ద డిపాజిట్ చేసిన సెల్ ఫోన్లను తీసుకుని పారిపోయి వచ్చినట్లు గుర్తించారు. దీంతో రైల్వే పోలీసులు టవరకెరె పోలీసులను గుంతకల్లుకు పిలిపించి.. ఆ సెల్‌ఫోన్లను, శుభాంకర్‌ను వారికి అప్పగించారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

గుత్తి, జూన్17(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లో జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూర్ ఈశ్వర్, ఎంఈఓ రవినాయక్ విద్యా మిత్ర కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామాంజినమ్మ, పాఠశాల చైర్మన్ కొనకొండ్ల సూరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

● పామిడి : పట్టణంలోని 13వ వార్డులో టీడీపీ మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ మంగళవారం పర్యటిస్తూ.. సమస్యలపై ఆరా తీశారు. బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ ప్రమాదానికి గురై చెయ్యి విరగడంతో.. ఆయన్ను పరామర్శించారు.

హై ఓల్టేజ్‌తో కాలిన ఎలక్ట్రానిక్ వస్తువులు

రూ.15 లక్షల మేర నష్టం.. బాధితుల ఆందోళన

కణేకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ, స్థానిక పెద్ద కాలువ వద్ద సోమవారం అర్ధరాత్రి హైఓల్టేజీతో అనేక ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ. 15 లక్షల విలువైన టీవీలు, ఫ్రిడ్జ్‌లు, విద్యుత్ దీపాలు, విద్యుత్‌వైర్లు కూడా కాలిపోయాయి. దీంతో బాధితులు మంగళవారం విద్యుత్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. విద్యుత్‌శాఖ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న ఇందిరమ్మ కాలనీవాసులు

నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మూడు నెలలుగా ఇదే పరిస్థితి.. రైతులకు తప్పని నిరీక్షణ



విడపనకల్లు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రైతుల కోసం మూడు నెలలు క్రితం 32 ట్రాన్స్‌ఫార్మలు తెప్పించారు. కొంత మంది రైతులు రాజకీయ నాయకుల ద్వారా సిఫారసు చేయించుకుని వాటిలో 15 ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకుని వెళ్లారు. మిగిలిన 17 ట్రాన్స్‌ఫార్మర్లు ఇలా నిరుపయోగంగా పడి ఉన్నాయి. జిల్లా అధికారులు రైతులకు ఇవ్వాల్సిన సామగ్రిని ఇవ్వక పోవటం వల్లే ఆ ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వలేదు స్థానిక అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ అధికారి లంచం ఇస్తేనే కేబుల్, అల్యూమినియం వైరు ఇస్తున్నారని, అలా లంచం ఇవ్వని తమను నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. పలుమార్లు అనంతపురానికి వెళ్లి.. నిరాశతో వెనక్కు వచ్చామని వాపోయారు. వర్షాలు రావటంతో పొలాల్లో పనులు చేయాల్సి ఉందని, ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రి ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ సత్యంను వివరణ కోరగా.. కేబుల్ వైరు, అల్యూ మినియం వైరు ఆలస్యంగా తమకు అందాయని, దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేక పోయామని, ప్రస్తుతం ఇద్దరు కాంట్రాక్టర్లను ఉపయోగించుకుని వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు ఇచ్చి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

30 పడకల ఆస్పత్రి కలేనా..!

కంబదూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే పెద్ద మండలంగా పేరు పొందిన కంబదూరులో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు కళగానే ఉండిపోయింది. ప్రభుత్వాలు.. పాలకులు.. అధికారులు మారినా ఆ ఆస్పత్రిని మాత్రం ఏర్పాటు చేయడం లేదు. మండలంలో 12 పంచాయతీలు, 42 గ్రామాలున్నాయి. 12 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. కర్ణాటక సరిహద్దులో ఉండటంతో వారూ ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ప్రతిరోజు ఈ ఆసుపత్రికి సుమారు 180 దాకా ఓపీకి రోగులు వస్తుంటారు. అయితే ఆ స్థాయికి తగ్గట్టుగా ఈ ఆస్పత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుండేవారు. రానురాను ఆ ఆపరేషన్ థియేటర్‌ను కూడా మూసివేశారు. తగినన్ని సౌకర్యాలు లేకపోవడంతో ఎమర్జెన్సీ కేసులను ఇక్కడి వైద్యులు కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి రెఫర్ చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి.. ఇక్కడ 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



కంబదూరు ప్రభుత్వాస్పత్రి